క్లుప్తంగా

శిఖండి షూటింగ్ ప్రారంభం



షూటింగ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి

చిత్తూరు రూరల్: చిత్తూరులో సోమవారం శిఖండి చిత్ర షూటింగ్‌ను ప్రారంభించారు. మిట్టూరులోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు క్లాప్ కొట్టి షూటింగ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు కోడి కిషోర్, చంద్ర పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

బంగారుపాళెం: మండలంలోని కొదలమడుగు పంచాయతీ బండ్లదొడ్డి ఎస్టీ కాలనీలో సోమవారం తాగునీటి ట్యాంకు నిర్మాణ పనులు చేపట్టారు. సర్పంచ్ మాలతి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

తవణంపల్లె: మండలంలోని మత్యంలో బుధవారం ఉదయం 9 గంటలకు జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహిస్తామని తవణంపల్లె ఎంపీడీఓ అబ్దుల్ కలాంఆజాద్ తెలిపారు. శిబిరంలో వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎర్రేపల్లెలో..

ఐరాల: మండలంలోని ఎర్రేపల్లె సచివాలయ ఆవరణలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరంలో వైద్యనిపుణులు వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేస్తారని ఆయన చెప్పారు. గతంలో ఎన్నడూలేని విధంగా గ్రామాలకే స్పెషలిస్ట్ వైద్యులు వస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దాతలు

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి నిత్యాన్నదానానికి చిత్తూరు జిల్లా పంట్రంపల్లెకు చెందిన కోదండరెడ్డి రూ.లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. మంగళవారం దాత కుటుంబసభ్యులు స్వామివారి దర్శనార్థం విచ్చేసి ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణికి స్వామివారి నిత్యాన్నదానానికి విరాళం అందించారు. దాత కుటుంబసభ్యులకు ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు కాణిపాక ఆలయ హుండీ లెక్కింపు

కాణిపాకం(యాదమరి): నేడు బుధవారం కాణిపాక హుండీ కానుకలు లెక్కించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఉదయం 7 గంటలకు స్వామివారి ఆస్థాన మండపంలో నిర్వహించే స్వామివారి హుండీ కానుకల లెక్కింపునకు ఆలయ అధికారులు, సిబ్బంది అందరూ హాజరు కావాలని కోరారు.

విగ్రహావిష్కరణకు విచ్చేయండి



ఆహ్వాన పత్రికను అందజేస్తున్న సుబ్రమణ్యస్వామి ఆలయ చైర్మన్, సభ్యులు

కాణిపాకం(యాదమరి): పాకాల మండలం ఊట్లవారిపల్లెలో కొత్తగా నిర్మించిన 54 అడుగుల సుబ్రమణ్యస్వామి విగ్రహం ఆవిష్కరణకు విచ్చేయాలని కాణిపాక ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశును సుబ్రమణ్యస్వామి ఆలయ చైర్మన్ పట్టాభిరెడ్డి, ఆలయ బోర్డు సభ్యులు విన్నవించారు. మంగళవారం ఊట్లవారిపల్లె ఆలయ చైర్మన్, బోర్డు సభ్యులు కాణిపాకం విచ్చేశారు. నవంబర్ 1న నూతనంగా నిర్మించిన 54 అడుగుల నూతన విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నామని, తప్పక రావాలని కోరారు.

కాణిపాకం: మహిషాసురమర్దినిగా..



పానాటూరులో ముత్యాలమ్మగా..



బంగారుపాళెం: రాజరాజేశ్వరీదేవిగా..



బంగారుపాళెం: ఓంశక్తి అమ్మవారి గ్రామోత్సవం





చిత్తూరు: విహరిస్తున్న మహిషాసురమర్దిని

మహిషాసురమర్దిని పాహిమాం

వాడవాడలా దసరా సంబరాలు సోమవారం, మంగళవారం మిన్నంటాయి. చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో ఇంటిల్లి పాది సోమవారం ఆయుధపూజ పండుగను ఘనంగా జరుపుకున్నారు. విజయదశమి సందర్భంగా ఇళ్లల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులను కటాక్షించారు.

చిత్తూరు రూరల్: చిత్తూరులో సోమ, మంగళవారాల్లో విజయదశమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. గిరింపేటలోని దుర్గాంబ దేవస్థానంలో సోమవారం రాత్రి పవళింపు సేవలో అమ్మవారు దర్శనమిచ్చారు. మంగళవారం పుష్పరథంలో శ్రీవిజయలక్ష్మీదేవిగా విహరించారు. గుర్రప్పనాయుడువీధిలోని శ్రీ అంకాళపరమేశ్వరి ఆలయంలో సరస్వతి, శ్రీరాజరాజేశ్వరీదేవిగా కనువిందు చేశారు. ముత్యాలమ్మ ఆలయంలో రాజరాజేశ్వరి అలంకరణలో దర్శనమిచ్చారు. కోదండరామస్వామి ఆలయంలో బలరామావతరం, కృష్ణావతారంలో అలంకరించి భక్తులకు దర్శనం ఇచ్చారు. సాయిబాబా ఆలయంలో అన్నపూర్ణదేవి, రాజరాజేశ్వరిదేవిగా అభయమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.

ఆకట్టుకున్న మహిషాసురమర్దిని సంహారం..

చిత్తూరులోని తేనెబండ నీవానది ఒడ్డున మంగళవారం శ్రీపాదం ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన మహిషాసురమర్దిని సంహార ఉత్సవం విశేషంగా ఆకట్టుకుంది. ముత్యాలమ్మ ఆలయం నుంచి అమ్మ వారిని తీసుకెళ్లి నీవానది ఒడ్డున పారేటి ఉత్సవాన్ని నిర్వహించారు. దుర్గాదేవి త్రిశూలంతో మహిషాసురుణ్ణి వధించే ఘట్టాన్ని అద్భుతంగా చూపించారు. కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపకులు కుమరేష్, సభ్యులు సుమన్, సాయికుమార్, పవన్ కుమార్ పాల్గొన్నారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: నవరాత్రి ఉత్సవాల్లో చివరిరోజు వజ్రాలపురం బోయకొండ గంగమ్మ లలితా త్రిపుర సుందరిదేవిగా దర్శనమిచ్చారు. బంగారుపాళెంలో గ్రామదేవత ముత్యాలమ్మ రాజరాజేశ్వరిదేవిగా భక్తులను కటాక్షించారు. రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని విశేషంగా అలంకరించి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. మొగిలి శివాలయంలో కామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. మొగిలి వెంకటగిరిలో సీతారాముల గ్రామోత్సవాన్ని నిర్వహించారు. వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, సర్పంచ్ దీప్తిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తులసీరామకృష్ణారెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు.

గుడిపాలలో..

గుడిపాల: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కందగిరి కొండ వద్ద దుర్గమ్మ విజయలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పల్లూరు గంగమ్మ మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులను కటాక్షించారు.

కాణిపాకంలో..

కాణిపాకం(యాదమరి): కాణిపాకంలో వెలసిన కాళికాదేవి ఆలయంలో మంగళవారం రాత్రి అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

యాదమరిలో..

స్థానిక కన్యాకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఐరాలలో..

ఐరాల: దేవీశరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా వైఎస్ గేటులో చాముండేశ్వరి అమ్మవారి ఆలయంలో చివరిరోజైన విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని చాముండేశ్వరి అలంకారంలో భక్తులను కటాక్షించారు. ఉదయం, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.



గుడిపాల: మహిషాసురమర్దినిగా..



చిత్తూరు: పవలింపు సేవలో దుర్గాంబ



చిత్తూరు: రాజరాజేశ్వరీదేవిగా ముత్యాలమ్మ



యాదమరి: దుర్గాదేవిగా..



వైఎస్ గేటులో గ్రామోత్సవం



గుడిపాల: విజయలక్ష్మి అలంకరణలో..

ప్రత్యేక హోదా ఇస్తామని మోసం

- ఏపీసీసీ రాష్ట్ర చైర్మన్ తులసిరెడ్డి

చిత్తూరు కలెక్టరేట్: ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామన్న బీజేపీ మాట తప్పి మోసం చేసిందని ఏపీసీసీ రాష్ట్ర చైర్మన్ తులసిరెడ్డి విమర్శించారు. ఆ పార్టీ జిల్లా కార్యాలయం ప్రాంగణంలో మంగళవారం కొత్తగా నియమితులైన జిల్లా అధ్యక్షుడి ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన పోటుగారి భాస్కర్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదాకు బీజేపీ పంగనామం పెట్టిందన్నారు. వైఎస్సార్ కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు కేంద్రం స్వస్తి పలికిందని విమర్శించారు. విశాఖ, విజయవాడల్లో మెట్రో ప్రాజెక్టు అమలు చేయలేదన్నారు. విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, 13 కేంద్రీయ సంస్థలు నత్తనడకన సాగుతున్నట్లు చెప్పారు. శ్రీకాళహస్తి వద్ద ఉన్న మన్నవరం ప్రాజెక్టును కేంద్రం మూసివేసిందన్నారు. బీజేపీ ఏపీకి తీరని ద్రోహం చేసిందని దుయ్యబట్టారు. పార్టీ నేతలు టిక్కిరాయల్, ధనంజయనాయుడు, పరదేశి పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న భాస్కర్

కళాతరంగిణి విద్యార్థుల ప్రతిభ

బైరెడ్డిపల్లె: దసరా పురస్కరించుకుని కడపలోని శిల్పారామంలో రాష్ట్ర పర్యాటక శాఖ సోమవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక మేళాలో బైరెడ్డిపల్లె కళాతరంగిణి సంస్థ విద్యార్థులు తమ కళాప్రతిభ చాటి ప్రశంసలందుకున్నారు. శాస్త్రీయ, జానపద నృత్యాలు ప్రదర్శించి హర్షిత, జనని, ప్రవల్లిక, పళని, రాజు, పవిత్ర, కరుణశ్రీ, సువర్ణ, భవ్యశ్రీ, ఉష, మానసను శిల్పారామం రాష్ట్ర కో-ఆర్డినేటర్ మునిరాజు, ఏఓ శివప్రసాద్, ఆర్గనైజర్ పద్మాకర్‌రావు అభినందించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాతరంగిణి సంస్థ వ్యవస్థాపకులు రాజేష్‌బాబు, మస్తాన్‌వలీ, జయచంద్ర, శివాజీ పాల్గొన్నారు.



శిల్పారామంలో కళాతరంగిణి విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న మునిరాజు

క్రీడాకారుల్లో రెట్టించిన ఉత్సాహం

- పిల్లల్లో జోష్ నింపిన మంత్రి ఆర్‌కే రోజా
- క్రీడాకారులతో కలిసి నృత్యం

నగరి : పట్టణ పరిధిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 8వ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో భాగంగా సోమవారం రాత్రి నిర్వహించిన ఫైర్ క్యాంప్ కార్యక్రమంతో మైదానంతో ఆనందపు కేరింతలు వినిపించాయి. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజనసర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా క్రీడాకారులతో మమేకమై తన విద్యార్థిదశను గుర్తు చేసుకున్నారు. తాను మీతోటి క్రీడాకారిణినే అంటూ తన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ మంటల చుట్టూ తిరుగుతూ ఆనందంగా నృత్యం చేయడం ఈ కార్యక్రమానికి నూతన హంగులను చేకూర్చింది. మంత్రితో కలిసి నృత్యం చేసిన విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. వాళ్లలో కొత్త జోష్ కనిపించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వరుసగా క్రీడల్లో పాల్గొని అలసిపోయిన విద్యార్థుల్లో కొత్త జోష్ నింపడానికే టోర్నమెంట్లలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. ఇది విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపుతుందన్నారు. అప్పటివరకు జరిగిన పోటీల్లో గెలుపోటములు మరచి అంతా మంచి స్నేహితులమనే భావన పెంపొందిస్తుందన్నారు. అనంతరం పోటీలను చక్కగా నిర్వహించిన రాష్ట్ర, జిల్లా, నగరి బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులను ఆమె దుశ్శాలువలతో సత్కరించారు. మంత్రి సోదరుడు రామ్ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.



క్యాంప్ ఫైర్ వెలిగిస్తున్న మంత్రి ఆర్కేరోజా

ఐకమత్యంతో అభివృద్ధి సాధ్యం

వి.కోట: గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, ప్రజలు ఐకమత్యంతో ఉంటే అభివృద్ధి సాధ్యమవుతుందని, ఎలాంటి సమస్యనైనా సామరస్యంగా పరిష్కరించుకోవచ్చని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని బోడిగుట్ట పంచాయతీ దొడ్డిపల్లెలో ఇరువర్గాల నడుమ ఏళ్ల తరబడి పలు సమస్యలతో ఉన్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సామరస్యంగా పరిష్కరించారు. మంగళవారం సీసీరోడ్ల పనులకు ఆయన భూమి పూజ చేసి మాట్లాడారు. నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు వేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం స్థానిక దుర్గామాత ఆలయంలో జెడ్పీ చైర్మన్ దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎంపీపీ యువరాజు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

- చిత్తూరు మండలం అనంతాపురం గ్రామానికి చెందిన బాబు అనే వ్యక్తి జ్వరంతో చిత్తూరు కొంగారెడ్డిపల్లి ప్రాంతంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిని ఆశ్రయించాడు. చికిత్స చేసిన వైద్యులు ల్యాబ్ టెస్ట్‌కు సిఫార్సు చేశారు. దీంతో ఆవ్యక్తి ఎలాంటి వైరల్ ఫీవర్‌లేదని తేలింది. ఇందుకు రూ.800 ఫీజు రాశారు. ఇందులో రూ.600 ల్యాబ్ నిర్వాహకుడికి చేరగా..మిగిలిన రూ.200 కమిషన్‌గా జేబులో ఉంచుకున్నారు.
- నగరంలోని మురకంబట్టులో నివాసముంటున్న రాజేష్ అనే వ్యక్తి నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి గ్యాస్ట్రిక్ సమస్యతో వెళ్లాడు. అక్కడ డాక్టర్లు పరీక్షించి రూ.1,500 విలువ చేసే మందులు రాసిచ్చారు. అలాగే ఫీజు రూ.800 గుంజుకున్నారు. అలాగే ఇంజక్షన్ అంటూ మరో రూ.300 వసూలు చేశారు. ఇలాంటివి మరెన్నో ఉన్నాయి.

ప్రైవేటులో నిబంధనలకు నీళ్లు

- కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో అధిక ఫీజు వసూళ్లు
- అనవసరంగా ల్యాబ్ టెస్టులు
- కమీషన్ కక్కుర్తితో రక్తం పిండేస్తున్న వైనం
- విచ్చలవిడిగా ఈ రకమైన దందా
- అధికారులకు ఫిర్యాదుల పరంపర



ప్రైవేటు ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

చిత్తూరు రూరల్: కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు వైద్యం పేరుతో దోపిడీకి తెరతీస్తేనాయి. ఫీజుల పేరుతో రోగుల నుంచి అధిక కాసులు గుంజేస్తున్నాయి. అనవసరంగా ల్యాబ్ టెస్టులంటూ దోచుకుంటున్నాయి. కమీషన్లకు కక్కుర్తి పడి రోగుల రక్తాన్ని పిండేస్తున్నాయి. విచ్చలవిడిగా ఈరకమైన దందాలకు పాల్పడుతూ ప్రైవేటు ఆస్పత్రులు నిబంధనలను అతిక్రమిస్తున్నాయి. దీనిపై వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదులు వెలువెత్తుతున్నాయి. చిత్తూరులో ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లు 125 దాకా ఉన్నాయి. ఈ మధ్యకాలంలో వీధివీధికి క్లినిక్‌లు వెలిశాయి. వీటిలో కొన్నింటికి రిజిస్ట్రేషన్ ఉంటే, మరికొన్నింటికి అనుమతులు లేకుండా అక్రమంగా నడుస్తున్నాయి. దీంతో పాటు ల్యాబ్ కేంద్రాలు సైతం పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఇవన్నీ వెరసి చిత్తూరులో వైద్యం పెద్ద వ్యాపారంగా మారింది.

లింకులతో...

ఒక ఆస్పత్రి నుంచి మరో ఆస్పత్రికి లింకులుంటున్నాయి. దీంతో వారి సేవలకు అనుగుణంగా రోగులను పంపించుకుంటున్నారు. జ్వరమని వస్తే రూ.1000 నుంచి రూ.1,500 వరకు వసూళ్లు చేయకుండా వదలడం లేదు. అవసరం లేని వ్యక్తికి విధిగా టెస్టులు చేయిస్తున్నారు. అలా రూ.400 నుంచి రూ.5 వేల వరకు పరీక్షలు చేస్తున్నారు. కొన్ని చోట్ల ఆస్పత్రిలో ల్యాబ్‌లు లేకపోగా ల్యాబ్ నిర్వాహకుడితో ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. రోగుల ద్వారా అధిక ఫీజులు వసూళ్లు చేసి కమీషన్ పోను మిగిలిన నగదును ల్యాబ్‌కు కడుతున్నారు. దీంతో పాటు మందులు, మాత్రల అమ్మకాల వ్యాపారం కూడా జోరందుకుంటోంది. అనుమతి లేకుండా చాలా మంది ఆస్పత్రిలోనే మాత్రల అమ్మకాలు చేసుకుంటున్నారు. బ్రాండెండ్ పేరుతో అధిక రేట్లకు విక్రయించుకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఒక ఆస్పత్రి నుంచి మరో ఆస్పత్రికి రెఫర్ చేస్తే కూడా అందుకు తగ్గట్లు రెఫర్ చేసిన వ్యక్తికి కమీషన్లు ఇచ్చుకుంటున్నారు. ఇదే తరహాలోనే స్కానింగ్ దందా చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నిబంధనలు పాటిస్తే ఒట్టు..

ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లు నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఆతర్వాతే చికిత్స ప్రారంభించాలి. దీంతో పాటు ఆస్పత్రికి ఫైర్ సర్టిఫికెట్, బయోమెడికల్ వేస్టేజ్ సర్టిఫికెట్, పొల్యూషన్ కంట్రోల్, డిక్లరేషన్, డాక్టర్ సర్టిఫికెట్, నర్స్ సర్టిఫికెట్, పారామెడికల్‌లో ఎల్‌టీ, ఫార్మాసిస్ట్ సిబ్బంది సర్టిఫికెట్, భవన సంబంధిత పత్రాలు, ఆస్పత్రిలో ఉండే వైద్య పరికరాల వివరాలను పక్కాగా అందించాల్సి ఉంటుంది. ఆ ఆస్పత్రిలో ఉండే స్పెషాలిటీ వివరాలు తెలియజేయాల్సి ఉంటుంది. కానీ ఇలాంటివి చాలా ఆస్పత్రుల్లో కానరావడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారు. అలాంటివి తెలిస్తే వారిపై క్రిమినల్ కేసులు పెడతామని అధికారులు చెబుతున్నారు. దీనిపై జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. వచ్చిన ఫిర్యాదులపై అధికారులు గుట్టు చప్పుడు కాకుండా తనిఖీలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు..

ప్రైవేటు ఆస్పత్రులు నిబంధనల ప్రకారమే నడపాలి. ఇష్టానుసారంగా ఫీజులు వసూళ్లు చేస్తే ఊరుకోం. ప్రతి విషయాన్ని..ఫీజులను కూడా బోర్డుపై ప్రకటించాలి. అనవసరంగా ల్యాబ్ టెస్టులు రాయకూడదు. అక్రమ స్కానింగ్ చేస్తే క్రిమినల్ కేసులు తప్పవు. వచ్చిన ఫిర్యాదులపై కచ్చితంగా తనిఖీ చేసి చర్యలు తీసుకుంటాం.

–ప్రభావతిదేవి, డీఎంహెచ్ఓ, చిత్తూరు



రథోత్సవం..రమణీయం



రథోత్సవంలో భక్తులు

బైరెడ్డిపల్లె: శరవన్నరాత్రి ఉత్సవాలు మంగళవారం అంగరంగవైభవంగా ముగిశాయి. తీర్థం గ్రామంలోని శ్రీరామచంద్రస్వామి ఆలయంలో రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. రంగురంగుల పుష్పాలతో అలంకరించిన బ్రహ్మరథంపై రామచంద్రస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి గ్రామంలో ఊరేగించారు. అలాగే కన్యకాపరమేశ్వరి ఆలయం, సల్లాపురెమ్మ ఆలయం, బాటగంగమ్మ ఆలయంలో సోమవారం అమ్మవారు కాళికాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం నిజరూపదర్శనంలో భక్తులను అనుగ్రహించారు.



కన్యకాపరమేశ్వరి ఆలయంలో భక్తులు